# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

**-పలమనేరు ఆర్డీఓ కార్యాలయం వద్ద బారులుతీరిన అర్జీదారులు**

**-వందలో 95 శాతం రెవెన్యూ సమస్యలే..!**

**-సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు - కలెక్టర్**





పలమనేరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:
పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు(గ్రీవెన్స్)కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద వందల సంఖ్యలో ఆర్జీదారులు బారులు తీరారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీఓ భవాని ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అర్జీదారులు వారి సమస్యలపై ఫిర్యాదులను జిల్లా అధికారులకు ఇవ్వడం జరిగింది. ఆర్జీదారుల ఫిర్యాదులలో వందలో 95 శాతం రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదులు ఉండడం జరిగింది. రెవెన్యూ శాఖకు సంబంధించి 364 అర్జీలు, హౌసింగ్ శాఖకు సంబంధించి 8, డిఆర్డిఎకు సంబంధించి 14, పోలీసు శాఖకు సంబంధించి 3, మున్సిపల్ శాఖకు సంబంధించి 4 మరికొన్ని శాఖలకు సంబంధించి 17 మొత్తం 428 ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు.

**భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా - కలెక్టర్ సుమిత్ కుమార్:**
భూమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండాగా ముందుకు సాగాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. పలమనేరు డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఫిర్యాదులలో 95 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. డికేటి, కుటుంబ తగాదాలు, ఆర్ఓఆర్, ఆన్‌లైన్ రికార్డులలో సమస్యలు, రీ సర్వే సమస్యలు ఉన్నాయన్నారు. రాన్ను మూడు నెలలు పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ముఖ్యంగా భూ సమస్యలు పరిష్కారానికి అధికారులకు సరిపడా సమయం ఇస్తున్నామని, ప్రజలకు నాణ్యమైన పరిష్కారం అధికారులు చూపాలని లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రజా సమస్యలపై ప్రత్యేక చర్యలు-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి:**
పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆలోచన అని, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజల దగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కారమార్గం చూపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు. పలమనేరు ఆర్డీఓ పరిధిలోని పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో గల ప్రజల సమస్యలను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, పి.ఆర్.ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, డోమా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, డిఆర్డిఎ పిడి శ్రీదేవి, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, పలమనేరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారం చూ పాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు 372 మంది అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. నిర్దేశిత గడువు లోపు అర్జీలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా, డివిజన్, మండల, గ్రామీణ స్థాయి అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, సబ్ కలెక్టర్లు పాల్గొన్నారు.

### మద్యం షాపులకు

# అనధికార సిట్టింగ్ రూమ్స్!



**-చూసీచూడని ఎక్సైజ్ అధికారులు -వ్యాపారమే ధ్యేయంగా అమ్మకాలు**

ప్రభాతవార్త న్యూస్‌నెట్‌వర్క్-తిరుపతి:
ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం షాపుల నిర్వహణ వెళ్లడంతో అక్కడ ఇప్పటివరకు కేవలం మద్యం బాటిళ్ళ అమ్మకాలు మాత్రమే చేయాలనేది ప్రభుత్వ ఆదేశాలు. అయితే మందుబాబులు మాత్రం మద్యం కొని ఎక్కడ తాగాలనేది అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా కొందరు అనదికారికంగా షెడ్లులాగా ఏర్పాటుచేసుకుని కుర్చీలు వేసి తాగిస్తుండటం మరీ విచిత్రం. మద్యం దుకాణాల వద్ద తాగించకపోతే రోడ్లపైన, ఖాళీస్థలాల్లో మద్యం తాగితే పోలీసులు దాడులు చేసి కేసులు పెట్టడంపై కూడా మందుబాబులు నిరసన వెలిబుస్తున్నారు. ఉదయం 10గంటల నుండి రాత్రి 11గంటల వరకు మద్యం షాపులు తెరచి వ్యాపారం చేసుకోవచ్చనేది ప్రభుత్వ నిబంధనలు. మరీ తిరుపతినగరం, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట వంటి చోట్ల ఉదయం 8గంటలకే మద్యం షాపులు తెరచి వ్యాపారాలు చేస్తున్నా అడిగే అధికారే లేడనేది విమర్శలు. తిరుపతి నగరం శివార్లలోని మద్యం షాపులకు అనుబంధంగా షెడ్లు వేసుకుని సిట్టింగ్ రూమ్‌లుగా మార్చేసినా అడిగే వారే కరువయ్యారు. లాభాపేక్ష ధ్యేయంగా వ్యాపారాలు చేసుకోవడం ఎక్సైజ్ అధికారులకే ఎరుక. ఇదిలా ఉండగా ఇప్పటికే తిరుపతిలో జరిగిన ఎక్సైజ్‌శాఖ సమీక్షలో మంత్రి కొల్లురవీంద్ర వద్ద మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్స్ ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రతిపాదనలపై పర్మిట్ రూమ్‌లకు అనుమతిఇవ్వడమే మంచిదని అధికారులు తమ అభిప్రాయాలను మంత్రి వద్ద వెల్లడించారు. దీనివల్ల మద్యం షాపుల ముందు, రోడ్లపై మద్యం తాగకుండా పర్మిట్‌రూమ్‌లకు అనుమతినిస్తే మరింత వ్యాపారం పెరుగుతుందని చెబుతున్నారు. సిట్టింగ్ రూమ్‌లకు పర్మిట్‌రూమ్‌లకు అనుమతినిస్తే మినీ బార్లుగా మారుతాయనేది కొందరి అభిప్రాయం. మరీ అనధికారికంగా వెలసిన సిట్టింగ్ రూమ్స్‌పై అదికారులు ఎలాంటి యాక్షన్ తీసుకుంటారనేది కొసమెరుపు.

## పోలీసులు ఆరోగ్యంగా ఉంటే... జిల్లా అంతా ఆరోగ్యంగా ఉంటుంది

**- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త
పోలీసులు ఆరోగ్యంగా ఉంటే మన జిల్లా అంతా ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ హాస్పిటల్ రెనోవేషన్ చేసిన హాస్పిటల్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజల రక్షణ కోసం పని చేస్తున్న పోలీసు సిబ్బందికి మంచి హాస్పిటల్ ఎర్పాటు చేసుకోవడం ఎంతో అవసరం అన్నారు. పోలీసు సిబ్బంది కోసం జిల్లా హాస్పిటల్‌ను రెనోవేషన్ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనారో గ్యంతో వస్తున్న పోలీసు సిబ్బందికి సరైన వసతులు కల్పించడం మన భాద్యత అన్నారు. అనారోగ్య సమ స్యలతో రోజుకు ఎంత మంది సిబ్బంది వస్తారని హాస్పిటల్ సిబ్బందిని వివ రాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పి టల్‌కు వస్తున్న సిబ్బందికి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటున్నా యా అని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చిన వేంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లా నలుమూలల నుండి పోలీసు హాస్పిటల్ కు వస్తున్న పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యపరీక్షలు కోసం హస్పటల్ కు వస్తున్న పోలీస్ సిబ్బంది పట్ల హాస్పిటల్ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఉద్యోగులుగా తీసుకోవాలి



చిత్తూరుటౌన్ ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త) :
ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులుగా పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్షేత్ర సిబ్బంది పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ఫీల్డ్ అసిస్టెంట్లు చిత్తూరు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయము ఆవరణలో వీరు ప్రదర్శన నిర్వహించారు. క్షేత్ర సహాయకులపై జరుగుతున్న దారుణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. గ్రామ సచివాల యాలల్లో తమను ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకట శివ చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు లకు వినతి పత్రం అందజేశారు.

### గ్రామాల్లో ఆర్ఎంపిల వైద్యం

# ప్రజల ప్రాణాలతో చెలగాటం

నాయుడుపేట ఏప్రిల్ 21 ప్రభాతవార్త ;
గ్రామాల్లో ఆర్ఎంపిల వైద్యంచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబందిత వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట పట్టణం, మండలంలోని అన్నమేడు, మేనకూరు, పండ్లూరు, తదితర ప్రాంతాల్లో కొంతమంది ఆర్ఎంపిలు అద్దెభవనాలను తీసుకొని తెలిసితెలియని అరకొర వైద్యంచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నాయుడుపేట పట్టణంలోని మెడికల్‌షాపుల్లో విచ్చలవిడిగా మత్తును కలిగించే టాబ్లేట్స్, ఇంజక్షన్ల విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నా సంబంధిత డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలోని బజారువీదుల్లో పుట్టగొడుగుల్లా రోజురోజుకు మెడికల్‌షాపులు పుట్టుకోస్తున్నా తనిఖీలు చేపట్టవలసిన డ్రగ్ఇన్స్‌పెక్టర్లు, విజిలెన్స్ ఎన్‌పోర్సు మెంటు అధికారులు నెలసరిమామ్ముళ్ళతో సరిపెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. నాయుడుపేటలో మత్తును కలిగించే టాబ్లేట్స్, ఇంజక్షన్లకు అలవాటుపడిన ప్రజలు అధికమోతాదులో వాడటం వల్లన ఇటీవల కాలంలో ఒకరు కోమాలోకి వెళ్ళిన సంఘటన తెలిసిందే. అయితే

**పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు ...**

మరికొన్ని మెడికల్‌షాపుల నిర్వహకులు పక్కన షెల్టర్ ఏర్పాటు చేసుకొని జ్వరంవచ్చిన వారికి సెలైన్‌పెట్టడం, ఇంజక్షన్లు వేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నాయుడుపేటలో కొంతమంది మెడికల్‌షాపులకు చెందిన లైసెన్స్‌ల కాలపరిమితి పూర్తైన రెన్యూవల్ చేయకుండనే షాపును యదావిధిగా సాగిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండ కొంతమంది మెడికల్‌షాపుల నిర్వాహకులు కంపెని మెడిసిన్‌కు ప్రాముఖ్యత ఇవ్వకుండ ఎక్కువ శాతం ఆదాయం వచ్చే లోకల్ కంపెని మందుకు ప్రాధాన్యత కల్పిస్తూ అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండ గ్రామాల్లో ఏలాంటి అనుమతులులేని చిల్లర దుకాణా దారులకు విచ్చలవిడిగా టాబ్లేట్లు విక్రయిస్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌ను వివరణ కోరగా ఆమె మాట్లడుతూ నాయుడుపేటలో ఎవరైన మత్తుకు సంబందించిన మెడిసిన్ల విక్రయిస్తుంటే అటువంటి మెడికల్‌షాపులపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


**బోరుమోటారు వేయకనే రూ.లక్ష డ్రాచేసేశారు**

కలెక్టర్‌కు మాజీ ఎంపీపీ ఫిర్యాదు

**వ్యవసాయ కళాశాల విద్యార్థులచే జాతీయ సదస్సు**

**సీడ్స్ అధికారి తీరుకు నిరసన విధులు బహిష్కరించిన హమాలీలు**

**కాణిపాకం హుండీల ద్వారా 1.72 కోట్లు ఆదాయం**

4లో


### అన్నదాతల పంటలకు

# గిట్టుబాటు ధర కలేనా?



తొట్టంబేడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త
చిత్తూరుజిల్లా తూర్పు మండలాలు ధాన్యాగారాలుగా ప్రఖ్యాతి చెందాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో పండించిన వరి పంటకు గిట్టుబాటు ధరలేక తల్లడిల్లుతున్నారు. ఈ ప్రాంతాల్లో రైతులు బిపిటి 5204, బుడ్డొడ్లు విస్తారంగా పండించారు. పంట దిగుబడి అయితే బాగా వచ్చింది కానీ రైతులు ఆశించిన ధరలు లేకపోవటంతో ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో రైతులు పండించిన వరి పంటకు కల్లాలోనే నిల్వ ఉంచుకొని ధైర్యంగా ఎవరు కొనుగోలు చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. గత ఏడాది బుడ్డొడ్లు(ఎడిటి 37, 42) బస్తా రూ.1100 వరకు అమ్ముడుపోయాయి. దాంతో రైతులు పోలోమని పండించి గిట్టుబాటు ధర లభించక బోరు మంటున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించామని గొప్పలు చెప్పుకుంటుంటే ఇదే మంచి అదను అని రాజకీయపార్టీలు ఆందోళనల పేరుతో కాలగడుపుతున్నారు తప్ప వాస్తవంగా అన్నదాతల కన్నీళ్ళు తుడిచే చిత్తశుద్ధి ఎవ్వరికి లేదనే అభిప్రాయం రైతుల్లో చోటు చేసుకుంది. ఆర్ఎస్ఆర్‌లు మాత్రం అంతంత మాత్రంగా ధరపలుకుతోంది.

**తూర్పు ప్రాంతాల్లో వ్యవసాయమే జీవనాధారం:**
ఈ ప్రాంతాల్లో రైతుల జీవనాధారం కేవలం వ్యవసాయంగానే ఉంది. పరిశ్రమలు అంతగా అభివృద్ధి చెందని ఈ ప్రాంతాల్లోని ప్రజలు 70శాతం వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ ప్రాంతాల్లోని రైతుల పరిస్థితి 'కొనబోతే కొరివి అమ్మబోతే అడవి'అన్న చందంలా మారింది. గతంలో ఎన్నడూ ఇంత నిర్లక్ష్యం లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది బిపిటిలు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలేదని ఈ ఏడాది బుడ్డొడ్లు పండిస్తే వాటికి కూడా ధర లేకుండా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వివరించారు. పరిమితంగా పండించిన బిపిటిలకు బస్తా 1000-1100రూపాయలు పలుకుతుందని వివరిస్తున్నారు. కాగా బుడ్డొడ్లు ఈ ఏడాది ధర బాగా పడిపోయిందన్నారు. ప్రస్తుతం బస్తా అప్పు లేని రైతుల నుంచి రూ.700లకు కొనుగోలు చేస్తున్నారని అయితే అప్పులు తీసుకుంటే 650రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. రెండు నెలల క్రితం కోతల సందర్భంగా దళారులు వివిధ కారణాలు చూపి బస్తా రూ.లు 600లకే రైతుల నుంచి కొల్లగొట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్వం పండించిన పంటల్ని నిల్వ ఉంచుకొనుటకు పుట్లు గాదులుండేవని నేడు మారిన సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్ళను కట్టుకునేందుకు ఇస్తున్న శ్రద్ధ తాము పండించిన పంటల్ని నిల్వ ఉంచుకునే అవకాశాలకు ఇవ్వటం లేదని దాంతో దళారులు కోరిన ధరలకు కల్లాలోనే పంటల్ని ధారబోసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇక ప్రభుత్వ గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకొను అవకాశం కల్పించినా వేలాది మంది రైతుల ధాన్యం నిల్వ ఉంచుకొనుటకు మొక్కుబడిగా నిర్మించిన మార్కెట్ కమిటి నాలుగు గోడోన్లు ఏం సరిపోతాయని ప్రశ్నిస్తున్నారు.

**బియ్యంధరలకు రెక్కలు:**
శ్రీకాళహస్తి పరిసరాల్లో వారం క్రితం వరకు బిపిటిలు, సోనామసూర, కర్నూలు సన్నాలు బియ్యం కిలో రిటైల్ మార్కెట్‌లో 26-27రూపాయలు విక్రయించగా టోకు వ్యాపారులు వంద కిలోల బియ్యా న్ని రూ.2500-2550వరకు విక్రయించే వారు. అదే స్టీమ్ బియ్యం అయితే రూ.లు 2200-2400 వరకు అందించే వారు. నేడు ఆ ధరలు ఒక్కసారిగా రెక్కలొచ్చినట్లు 2700-2900వరకు పెరిగింది. దాంతో వినియోగదారులు గొల్లుమంటున్నారు. ఒక్కసారిగా కిలో బియ్యానికి మూడు రూపాయలు పెరిగింది. ఇదేమి చొద్యం అని ప్రశ్నిస్తే వ్యాపారస్తులు మిల్లర్లు లేవి ఇవ్వటానికి సాహసిస్తూ సాధారణ బియ్యం ఉత్పత్తి చేయటం లేదని వాపోతున్నారు.

# నిరంతర సర్వేలతో కాలయాపన : ఎడతెగని రాజీవ్‌నగర్ సమస్య



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని రాజీవ్ నగర్‌లో అక్రమాలు, అక్రమణలకు సంబంధించి నిరంతర సర్వేలతో రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఎడతెగని సర్వేలతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది, అయితే ఇక్కడ మౌళిక సదుపాయాల కల్పనలో రెవెన్యూ, విద్యుత్‌శాఖలు దోబూచులాడటంతో పరిస్థితి ఆగమ్మగోచరంగా మారింది. వివరాలు పరిశీలిస్తే శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన నిరుపేదలకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడులు సుమారు 7వేల మందికి ఇళ్ళ స్థలాలను కొంత భూమి సేకరించి అందించారు. అయితే అప్పటిలో ఇక్కడ పెత్తనం ఆయా వార్డు కౌన్సిలర్లకు అప్పగించటంలో ఒక్కొక్కరు వందలాది ఇళ్ళ స్థలాలు తమ బంధులు, సన్నిహితుల పేర్లతో సొమ్ము చేసుకున్నారు. వాటిని దశల వారిగా విక్రయాలు సాగించారు. తరువాత 2019లో వచ్చిన వైకాపాపాలకులు దీనిని అవకాశంగా తీసుకున్నారు. ఎంఎల్ఏ సహాకారంతో కొందరు దళారులుగా మారారు. ఆయనముఖ్య అనుచరులు అధికార దర్పంతో ఎవరికి ఎంత అవకాశమో అన్ని సర్దుబాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఒకరిద్దరు మీడియాకుచెందిన వారు తమ చేతి వాటం ప్రదర్శించారు. సొమ్ము చేసుకున్నారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాజీవ్‌నగరలోని అక్రమణలపై కన్నెర్ర జేసారు.

**విద్యుత్ కనెక్షన్ల కోసం ఇబ్బందులు**

**ఎన్నిసార్లు సర్వేలు జరుపుతారు?**
కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రత్యేక సర్వేను నిర్వహించారు. జూన్ మాసంలో సర్వేలు జరిపి ఆక్రమణల భాగోతం బట్ట బయలు చేసారు. కొన్ని ఆక్రమణలను తొలగించారు. అయితే ఏమైందో ఏమో కానీ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ఆగిపోయింది. అయితే రెవెన్యూ అధికారులు 'మరో సారి సర్వే జరుపుతామనటం'తో ప్రజలు పలు అనుమానాలు చోటు చేసుకున్నాయి. 2009లో ఇక్కడి రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలపై, దురాక్రమణలపై సమగ్ర సర్వే జరిపారు. 7వేల పట్టాల్లో 2900 మంది అనర్హుల చేతిలో ఉందని జిల్లా స్థాయి అధికారులతో జరిపిన సర్వేలో తేల్చారు. అయితే 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వమే అధికారంలో ఉన్నా రాజీవ్‌నగర్ గురించి పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా పాలకులు దీనిపై ఫోకస్ చేసారు. వందలాది స్థలాలనుకబ్జా చేసారు. అమ్ముకున్నారు. సొమ్ము చేసుకున్నారు. దీనిపై ఉమ్మడి ప్రభుత్వం విచారణ వేగవంతం చేసింది. గుట్టురట్టు చేసింది, కానీ చర్యలు తీసుకోవటంలో 'రెవెన్యూశాఖ' ఎందుకు మీన మేషాలు లెక్కిస్తున్నారో అర్థం కావటం లేదు.

**విద్యుత్ కనెక్షన్లకు పేచీ:**
రాజీవ్‌నగర్, కైలాసగిరికాలనీల్లో ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని రెవెన్యూ అధికారులు సూచించినట్లు అర్హులైన వారికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటానికి ఆ శాఖ పూచీ పెడుతుంది. అయితే వైకాపా పాలనలో ఒక్కొక్క విద్యుత్ కనెక్షన్‌కు అప్పటిలో పని చేసి విద్యుత్‌శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు రూ.30వేల చొప్పునవసూలు చేసుకొని అనుమతించారు. ప్రస్తుతం శాసనసభ్యుని ఆదేశాలంటూ ఆపివేసారు. దాంతో జనంలో తాము కొనుక్కున్న రికార్డులు చూపుతున్నా ఎవరి పేరు మీద పట్టా ఉందో వారికే గ్రీన్ సిగ్నల్ ఇస్తామనటం ఆశ్చర్యం కల్గిస్తుంది. 18 సంవత్సరాల సాగిన లావాదేవీల్లో ఎన్నో చేతులుమారాయన్నది జగమెరిగిన సత్యం. మరి ఇప్పుడు ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని చర్చించుకుంటున్నారు. అయితే రాజీవ్‌నగర్‌లో నకిలి పట్టాలు ఉన్నాయని ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని చెబుతున్న రెవెన్యూ అధికారులు ఆ దిశగా ఎందుకు విచారణ చేపట్టడం లేదు?

## ద్రవిడ వర్సిటీలో యుజి..పిజి పరీక్షలు ప్రారంభం



కుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

ద్రవిడ విశ్వవిద్యాలయంలో యుజి, పిజికోర్సులకు సంబంధించి రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభయ్యాయి. వర్సిటీ ఉపకులపతి ఆచార్య దొరస్వామి వర్సిటీలోని పరీక్షా కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని ఆయన పరీక్షల అధికారులను ఆదేశించారు.

## బడిలోనే బడిఈడు పిల్లలు



బంగారుపాళ్యం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:

బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో వుండాలని బంగారుపాళ్యం గ్రామ సర్పంచ్ ఎంబి ఉమాదేవి అన్నారు. సోమవారం బంగారుపాళ్యం రాజావీధిలోని ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే మంచి విద్యాబోధన అందుతున్నదన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయం చేస్తోందన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం పాఠశాల నందు ఐదవ తరగతి పూర్తి చేసుకున్న 35 మంది విద్యార్థులు, 6వ తరగతి ప్రవేశం కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ర్యాలీగా వెళ్ళారు. హైస్కూల్ ఇన్‌ఛార్జీ హెడ్మాస్టర్ జనార్ధన్‌రెడ్డి ఆ విద్యార్థులకు స్వాగతం పలికి పాఠశాలలో నూతన ప్రవేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, హెడ్మాస్టర్ ధనంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత భాషకు సాహిత్య అకాడమీ అనువాద అవార్డు

తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త

కేంద్ర సాహిత్య అకాడమీ,న్యూ ఢిల్లీ ద్వారా సంస్కృత భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అనువాద అవార్డు 2024 ప్రకటించబడింది.సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ సంస్కృత భాషకు సాహిత్య అకాడమీ అనువాద అవార్డు 2024 ను అనువాదకుడు డాక్టర్ సోమనాథ్ దాస్ కి ఆమోదించారు.డాక్టర్ దాస్ ప్రస్తుతం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పరిశోధన,ప్రచురణ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా ఉన్నారు. ఆయన ఒడియా సాహిత్యంలో ప్రసిద్ధ రచయిత బ్రజ్ మోహన్ మహంతి లలితలవంగలత నవలని సంస్కృతంలోకి అనువదించారు.అకాడమీ నియమాలు ప్రకారం, ఈ పుస్తకం ప్రొఫెసర్ ఖగేశ్వర్ మిశ్రా,ప్రొఫెసర్ ఎన్.కె.సుందరేశ్వరన్, ప్రొఫెసర్ రమేశ్చంద్ర భర్ద్వాజ్ గల మూడు సభ్యుల జ్యూరీ మెజారిటీతో ఎంపికైంది. అవార్డు గ్రహీత డాక్టర్ సోమనాథ్ దాస్ కి తర్వాత ఒక ప్రత్యేక కార్యక్రమంలో తామ్రపత్రం,రూ. 50,000 నగదు బహుమతి అందజేయ బడుతుంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పలమనేరు,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పలమనేరు సోమవారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు ..నాగమంగళం మదరసాకు చెందిన ఉపాధ్యాయుడు సుహేల్(34) తన ద్విచక్రవాహనంలో పలమనేరు నుండి నాగమంగళం వెళుతుండగా కుప్పం నుండి పలమనేరు వైపు వస్తూన్న తమిళనాడు ప్రభుత్వ బస్సు ఢీ కొంది.ఈ ప్రమాదంలో సుహేల్ తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలో మృతి చెందగా స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## జనసేన నేతకు వినతిపత్రం అందించిన నాయిబ్రాహ్మణులు



తొట్టంబేడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని పూడి పంచాయతీలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న అర్ధనారీశ్వరాలయంలో ఎన్నో ఏళ్ళుగా ఉచితంగా సేవ చేస్తూన్న వాయిద్య కళాకారులుగా పనిచేస్తున్న ఆరు మందినాయిబ్రాహ్మణ కళాకారులుగా ఆరుమంది నాయిబ్రాహ్మణులు తమకు న్యాయబద్దమైన వేతనాలు అందించేలా చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటకు వవినతిపత్రం అందించారు. దేవాదాయశాఖ కమిషనర్‌కు తమ సమస్యలను తీసుకెళ్ళి పరిష్కరిస్తానని తెలిపారు. డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు కూడా విన్నవిస్తామని వినుత తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో శివకుమార్, యుగంధర్, సాయికుమార్, హేమాద్రి, మునికార్తీక్, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

## తిరుమలయ్యపల్లెలో జోరుగా పారిశుద్ధ్య పనులు

వేదురుకుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీలో ఎంపిడివో పురుషోత్తం సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో సోమ వారం జోరుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరి శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుం దన్నారు. మండలంలోని 25 పంచాయితీలలో రోడ్డు ప్రక్కల పేడ దిబ్బలు తొలగించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.పరిసరాలు శుభ్రతతో మంచి ఆరోగ్యం ఉంటుందని ప్రజలు గుర్తించి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు అధిక పాధ్రాన్యత ఇవ్వాలని సూచించారు.పంచాయితీ కార్యదర్శి. సచ్చివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి శ్రీ చౌడేశ్వరి దేవి వార్షికోత్సవ వేడుకలు

పుంగనూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త



మండలంలోని చదళ్ళ గ్రామం లో వెలసిన శ్రీశ్రీశ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి వార్షికోత్స వాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయం నిర్మాణం జరిగి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 23 నుంచి 25 వ తేదీ వరకు వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారము గణపతి పూజ, గణపతి ప్రార్ధన, పుణ్యాహవాచనం, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తుబలి, సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురార్పణం మహామంగళ హారతి, తీర్ధప్రసాద వినియోగం జరుగుతుంది.గురువారము వేదపారాయణం, గణపతిపూజ మరియు హోమం, ప్రధాన వేదికార్చన, వనగ్రహ ఆరాధన, ఉదయం నవగ్రహ హోమం, త్రిమూర్తుల ఆరాధన, హోమము శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆరాధన హోమము సప్తమాతృకల ఆరాధన, హోమము, కాలభైరవ ఆరాధన, హోమము విమాన గోపుర ఆరాధన, హోమము పూర్ణాహుతి, మహామంగళ హారతి తీర్ధప్రసాద వినియోగం. సాయంత్రం వేదపారాయణం, వైదిక ఆరాధన నిత్యహోమము లలిత త్రిశతి హోమము, పూర్ణాహుతి నిర్వహిస్తారు. శుక్రవారము వేదపారాయణం వేదికార్చన శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకం. ఉదయం సుగంధ ద్రవ్యములతో అభిషేకము నిత్య హోమం, సప్తమాతుక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి మూలమంత్ర హోమం, జయాది హోమం, ప్రాయచ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, కుంబాభిషేకం విశేష అలంకరణ, అర్చన, వేదపారాయణం, మంత్రపుష్పం, మహామంగళ హారతి చేపట్టనున్నారు.

## రోడ్డుకు అడ్డంగా ఇల్లు..!

గ్రీవెన్స్ డేలో డిప్యూటీ కలెక్టర్లకు ఫిర్యాదు

చిత్తూరుటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :



చిత్తూరు నగరం జాన కార పల్లెలో రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మా ణం చేపట్టి~ప్పటికీ మునిసి పల్ కార్పొరే షన్ అధికారులు చర్య లు తీసుకోవడం లేదని గ్రీవెన్స్ డే సందర్భంగా సోమ వారం జానకార పల్లకి చెందిన శివకుమార్ డిప్యూటీ కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. జానకార పల్లెలో 1962 లో అప్పటి ప్రభుత్వం దళితుల కోసం ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేసింది. 33 మంది దళితులకు పట్టాలు పంపిణీ చేసింది. ఒక్కో వ్యక్తికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు సాంఘిక సంక్షేమ శాఖ, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ కాలనీకి ప్రత్యేకంగా రోడ్డుకు కూడా స్థలం మంజూరు చేయడం జరిగింది. జానకపల్లికి చెందిన మురళి అనే వ్యక్తి రోడ్డుకు అడ్డంగా ఇంటిని నిర్మిస్తున్నాడు. 19 62లో ఏర్పాటుచేసిన కాలనీలో నాలుగవ నంబరు ప్లాటులో సగభాగం మురళి భార్య సంధ్య కొన్ని ఏళ్ల క్రితం కొనుగోలు చేసింది. అనంతరం ఇంటిని కూడా నిర్మించారు. వీరి కొనుగోలు డాక్యుమెంట్లో ఇంటిముందు వీధి ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అదేవిధంగా ఇంటి నిర్మాణం కు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ కు మున్సిపల్ అధికారులకు సమర్పించిన రికార్డుల్లో సైతం వీధి ఉన్నట్లు ఉంది. ఏడాది క్రితం మురళి రోడ్డుకు అడ్డంగా ఇంటిని నిర్మించడం ప్రారంభించాడు. దీనికి సంబంధించి జానకారపల్లెవాసుల ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు మురళికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను బేకా తయారు చేస్తూ ఇటీవల తిరిగి ఇంటి నిర్మాణం చేపట్టాడు. రోడ్డుకు అడ్డంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణానికి సంబంధించి గతంలో చిత్తూర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్లు కూడా నిరాకరించారు. అయినప్పటికీ రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో అక్కడి ప్రజలు రోడ్డులో వెళ్ళలేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని తొలగించి యధావిధిగా రోడ్డును జానపద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఫిర్యాదుదారుడు డిప్యూటీ కలెక్టర్లను కోరారు. అక్రమ ఇంటి నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకట శివలు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

## సిద్ధయ్య సేవలు అభినందనీయం : మోహన్ మురళి

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :

పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ పదవి వీరమణ పొందిన ప్రధానో పాధ్యా యులు సిద్ధయ్యను సోమవారం ఘనంగా తెలుగు దేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులుమోహన్ మురళీ,నాయకులు దుశా లువతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సిద్ధయ్య సేవలు అభినందనీయమని కొనియాడారు. మండలంలోని తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయులుగా పనిచేసి పాఠశాల విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అలాగే పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విలువైన సేవలు అందజేశారని చెప్పారు. విశ్రాంతి జీవితం కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సుఖసంతోషలతో సాగలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా రెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



అధికార యంత్రాంగం తమ దృష్టికి వచ్చే ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను ఆయా శాఖల వారీగా పంపడం జరుగుతుందన్నారు. అధికారులు ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారంకై సాధ్యాసాధ్యాలను సిద్ధం చేసి వినతిదారులకు తగు సమాచారం అందించాలన్నారు. కాగా సోమవారం కడ పి.డి.కి రెవెన్యూకు సంబంధించి 17, హౌసింగ్ 1, ఎస్ఎస్ఎల్ఎ 4, పోలీసుశాఖకు సంబంధించి 3 మొత్తం 25 వినతులను ప్రజలు అందిం చారు. తహశీల్దార్ చిట్టిబాబు, డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, వెటర్నరీ ఎడి రెడ్డికుమారి, ఎంపిడిఒ విజయదత్, ఎంఇఒ మహబూబ్ బాషా, ఎఒ ఫయాజ్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మునాఫ్ పేర్కొన్నారు. మండలంలోని కంగుంది ప్రైమరీ స్కూల్‌లో సోమవారం సరస్వతిపూజ, వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిం చారు. ఈసందర భ్ంగా ఆయన మాట్లాడుతూ నేటిబాలలే రేపటిపౌరులని పిల్లలు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, అబ్దుల్ షుకూర్, శీను, రాజేశ్వరి, వరాలు, ఎస్ఎంసి ఛైర్మన్ ఆయేషా, సీమ పాల్గొన్నారు.

## వైకాపా నుంచి జనసేనలో చేరిన యువత

కుప్పం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు, నాయకత్వానికి ఆకర్షితులైన 12మంది యువత సోమవారం కుప్పం జనసేన ఇన్‌చార్జ్ నరేష్ సమక్షంలో వైకాపాను వీడి జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఎపిలో స్థానిక ఎన్నికలు వచ్చే ఏడాది రానున్న నేపథ్యంలో కూటమి నాయకులకు మద్దతుగా పనిచేయాలని సూచించారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నేతలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.



## పేదలకు ఉచితంగా ఆహారం పంపిణీ

కుప్పంరూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భం గా మున్సిపల్ పరిధి 25వ వార్డు లక్ష్మీపురంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, పార్టీ అధ్యక్షుడు నారాయణ, గంగమ్మగుడి డైరెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు ఆదివారం రాత్రి కుప్పంలో పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం జరిపారు. సుమారు 250 కిలోల చికెన్ బిరియానీ ప్యాకెట్లను స్థానిక బస్టాండు, రైల్వేస్టేషన్, ఫుట్‌పాత్‌పై ఉండే పేదలకు అందించడంతో పాటు

## తుమ్మలగుంటలో పులివర్తి సుధారెడ్డికి అపూర్వ స్వాగతం

-సమస్యలను సావధానంగా పరిష్కరించుకుందాం

-అంధకారంలో మహిళలతో ముఖాముఖీ కార్యక్రమం

తిరుపతిరూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



మహిళలతో ముఖాము కార్యక్రమానికి తుమ్మలగుంటకు విచ్చేసిన ఎమ్మెల్యే సతీ మణి పులివర్తి సుధారెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. సోమవారం తుమ్మ లగుంటలో యువనేత దొడ్ల కరుణా కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహి ళలతో ముఖాముఖీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ముఖా ముఖి కార్యక్రమం అంతా చీకటిలోనే కొనసాగడం గమనార్హం. మఠం భూము లలో ఇండ్లు నిర్మించుకున్న పేదల ఇండ్లకు కరెంట్ మీటర్లు ఇవ్వాలని కోరగా, మీటర్లు ఇచ్చే అధికారం తమకు లేదని, ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో ఉంటుందని స్పష్టం చేసారు. మఠం భూములలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ లేకుండా ఎవ్వరు ఇండ్లు నిర్మించుకున్న, ఎప్పటికైన కూల్చివేస్తారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరగా, అర్హులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తుందని తెలిపారు. తుమ్మలగుంటలో 169 ఎకరాల మఠం భూములు ఉన్నాయని, గత పాలకుల వల్లే అన్యాక్రాంతమైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. తుమ్మలగుంట చెరువును చెరువుగానే ఉంచి ఉంటే నీటి ఎద్దడి ఉండేది కాదని, మఠం భూములలో పార్కు అభివృద్ధి చేసి ఉంటే బాగుండేదన్నారు. తుమ్మలగుంట పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా నిలుస్తుందని, త్వరలో పార్కును తుడ స్వాధీనం చేసుకొంటుందని తెలిపారు. ప్రజా సమస్యలను సావధానంగా పరిష్కరించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి అలిమినేని మధు, దొడ్ల గౌరమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో రమేష్, భానుకుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముధుశేఖర్, నాగూరు శ్రీనివాసులు, ముంతాజ్, కత్తి సుధాకర్, తిరుచానూరు కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ః



శ్రీ వెంకటేశ్వర రామ్ నారాయణ్ రుయా ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో అనుబంధ సంస్థయైన ఎంపీహెచ్‌డబ్లూ (ఎఫ్) ట్రైనింగ్ నర్సింగ్ విద్యార్ధినులు డిసెంబరులో జరిగిన ఫైనల్ థియర్, ప్రాక్టికల్స్‌లో మంచి ప్రతిభ చూపించారు. పరీక్ష ఫలితాలను కమీషనర్, వైద్య, కుటుంబ సంక్షేమ విభాగం వారు విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. దీని ప్రకారం మొదటి సంవత్సరం 22 మందికి 20 మంది డిస్టింగ్షన్, 2మంది ద్వితీయ తరగతిలో ఉత్తీర్ణులుగా కాగా, రెండవ సంవత్సరంలో 17 మందికి 17 మంది డిస్టింగ్షన్ సాధించారు. మొదటి సంవత్సరంలో చదువుతున్న జె. జయంతి 90.5శాతం మార్కులు సాధించగా, రెండవ సంవత్సరంలో ఆర్. హేమలత 90.7 శాతం మార్కులు సాధించింది. పేద కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వం అందించే స్కాలర్ షిప్‌తో చదువుకుంటూ అత్యంత ప్రతిభ సాధించిన విద్యార్థినులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.

## విద్య ఒక్కటే పేదరికాన్ని రూపుమాపుతుంది..కోలా

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త





విద్య ఒక్కటే పేదరికాన్ని దూరం చేస్తుందని శ్రీకాళహస్తీశ్వరస్వామి మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ అన్నారు. సోమవారం పాఠశాల 33వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈసందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని తెలిపారు. అప్పుడే తను గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు. ఎంఈవో ఆర్. భువనేశ్వరి మాట్లాడుతూ తమ సంస్థ 33 సంవత్సరాలుగా నడపడం ఎంతో అభినందనీయం అన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు అన్న వ్యాఖ్యానికి ఈపాఠశాలే నిదర్శనమన్నారు. మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలతో సమయాన్ని కేటాయించి వారు ఏం చేస్తున్నారు, ఏం చదువుతున్నారో తెలుస్తుందన్నారు. అనంతరం అతిధులకు మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యమంలో కరస్పాండెంట్ పి.మాలతి, కె.చెంచుకృష్ణయ్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం : సీడీపీవో

విజయపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, అమృతంతో సమానమని నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణవేణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు చురుగ్గా ఉండాలంటే ప్రారంభం నుంచి తల్లిపాలు తాగించాలని కోరారు. పిల్లలు చిరు తిండ్లు పీజా, బర్గర్ లాంటి ప్యాకింగ్ ఆహారాలకు అలవాటు పడి ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, వాటికి బదులు రాగి రొట్టె, జొన్న, సూక్ష్మ పోషకాలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఫుడ్‌మేళా ఎగ్జిబిషన్ నిర్వహించారు. కూరగా యలు, ఆకు కూరలతో ప్రయోజనాలు వివరించారు. ఎంపీడీవో రాజేంద్ర, వైద్యాధికారి విష్ణుప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ ఏళుమలై, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



మండలంలోని క్షురికాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రాజును సోమవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణం

టిటిడి పాలక మండలి సభ్యులతో చర్చిస్తా..!, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



అత్యంత పురాతన తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణం కోసం టిటిడి పాలక మండలిలో చర్చించనున్నట్లు టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. తొండవాడ వద్ద గల అన్నమయ్య వారసుడు చిన్నన్నచే నిర్మించబడిన తిమ్మప్ప దేవాలయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మప్ప దేవాలయం శిధిలావస్థకు చేరుకోవడం భాధాకరమన్నారు. ఆలయ పరిసరాలలోని భూములు అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. ఆలయాన్ని పునర్నిర్మించడంతో పాటు దూపదీప నైవేద్యాలకు లోటు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం డార్మిటరీ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మప్ప దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మునిగంగిరెడ్డి, సభ్యులు సుబ్రమణ్యం యాదవ్, పాదిరి ధనంజయ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, నాయకులు దీనదయాళ్ నాయుడు, దొరస్వామి, శానంబట్ల మురళి రెడ్డి, టి.ఎ.ప్రసాద్, పాల్గొన్నారు.

## మద్యం షాపుపై కలెక్టర్‌కి ఫిర్యాదు

కేవీబీ పురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:




మండల కేంద్రంలో ఉన్న సిండికేట్ మద్యం షాపు నిర్వహణ లోపం కారణంగా స్థానికంగా ఉన్న గుడులు, ప్రభుత్వ కార్యాల యాలు గందరగోళంగా మారుతున్నాయని కేవీబీ పురం గ్రామా నికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే సంబంధిత ఎక్సైజ్ అధికారులు తమను సంప్రదించకుండానే, సమస్య పరిష్కరించకుండానే పరిష్కరించినట్టుల ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు నివేదికను అందించి సామాన్యుడి హక్కును కాలరాస్తున్నారని కేవీబీ పురం గ్రామానికి చెందిన కంధస్వామి, తదితరులు వాపోయారు. మండల కేంద్రంలో నడుపుతున్న మద్యంషాపు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందని, దీని కారణంగా ప్రశాంత కరువవడంతో పాటు, స్థానికంగా ఉన్న గుడి, బడులతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు సైతం మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయని వాపోయారు. ఇదే విషయాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారితో పాటు కలెక్టర్‌కి ఈ నెల 9న ఫిర్యాదు చేశామని, దీనిపై స్పందించిన జిల్లా ఎక్సైజ్ అధికారి గ్రామంలో విచారించకుండానే అక్కడ సమస్య లేదని, గత 15 ఏళ్లుగా అదే ప్రాంతంలో మద్యం షాపును నిర్వహి స్తున్నారనినివేదికనుఅర్జీదారులకుఅందించారు.ఎక్సైజ్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## "పులివర్తి" విజయంలో "పల్లినేని" సారధ్యం..!



**చంద్రగిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** చారిత్రాత్మక చంద్రగిరిలో తెలుగుదేశం పార్టీ ఎంఎల్ఏ పులివర్తి నాని విజయం సాధించడంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు విజయ సారథ్యం సర్వత్రా ప్రశంసనీయమైనది. పనపాకంకు చెందిన సుబ్రమణ్యం నాయుడు మండల స్థాయి టిడిపిలో చురుకైన నాయకుడుగా పనిచేశారు. మొదట పంచాయతీ సర్పంచ్‌గా పోటీచేసి ఓటమి చవిచూసినప్పటికీ చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారు. ఐతేపల్లి సింగిల్‌విండో చైర్మన్‌గా పోటీచేసి విజయం సాధించారు. ఈ క్రమంలో తన భార్య పల్లినేని మునిలక్ష్మిని పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో రెండు పర్యాయాలు తన అభ్యర్థులను ఎంపిటిసిలుగా గెలిపించుకున్నారు. పార్టీ కోసం నిర ంతరం కార్యకర్త వలే కష్టపడి పనిచేస్తూ ముందుకు సాగారు. 2016లో టిడిపి మండల అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. నాటి నుండి నేటి వరకు మండల అధ్యక్ష పదవిలో 9 ఏళ్ళుగా ముందుకు సాగుతున్న తీరు ఔరా అనిపించకమానదు. తమ నాయకుడు పులివర్తి నాని అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి అవిరళ కృషి చేశారు. అనేక ఆర్థిక ఒడిదుడుకులను, ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ ఏళ్ళ తరబడి మండల అధ్యక్షుడుగా పార్టీ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చంద్రగిరి మండలంలోని నాయకులను, కార్యకర్తలను ఒక్కతాటిపైకి తీసుకురావడంతో వారికి గల ప్రజాబలాన్ని పార్టీకి అన్వయించుకోవడంలో ఆయన చూపిన రాజకీయ చతురత ప్రశంసలందుకున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి విధేయుడుగా వుంటున్న ఆయన ఎంఎల్ఏ పులివర్తి నానితో పాటు పులివర్తి కుటుంబానికి అత్యంత నమ్మకస్థుడుగా ముందుకు సాగుతున్నారు.

## మలబార్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

తిరుపతి విద్య, ఏప్రిల్ 21 ప్రభాత వార్త



బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ డైమండ్స్ అక్షయ తృతీయ పర్వదినం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పండుగ ఆఫర్లను సగర్వంగా ప్రకటించింది. ఈ శుభ సందర్భాన్ని మరింత చిరస్మరణీయంగా మార్చడానికి విలువ, నమ్మకం, శ్రేష్ఠతను అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న మలబార్ తమ కస్టమర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డీల్స్ అందిస్తోంది. అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాల తరుగు చార్జీల పై 25 శాతం వరకు తగ్గింపును ఇస్తుంది అని తెలిపారు. ఈ పండుగ ఆఫర్ల గురించి మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ "శ్రేయస్సు మరియు కొత్త ఆరంభాల శుభదినంగా అక్షయ తృతీయ పర్వదినం, అపారమైన సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది అని అన్నారు. సాటిలేని విలువ, కాలాతీత డిజైన్లను అందించడం ద్వారా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వద్ద, మా కస్టమర్లకు ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా రూపొందించాలనే లక్ష్యంతో ఉన్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ శాసన సభ్యులు సుగుణమ్మ, మలబార్ సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీల్లో పీఈటిలకు న్యాయం చేయండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

గత ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో (2023) స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్) వారు అందరు కోరుకోగా ఈవిధాపం వల్ల పిఈటిలు అందరు వారికి 20 నుంచి 25 సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికీ దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చింది ప్రస్తుతం వచ్చేనెల మేలో జరిగే బదిలీల్లో భాగంగానైనా తెలుగుదేశం ప్రభుత్వం దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం మే నెలలో జరగబోవు బదిలీల్లో అయినా ఈప్రభుత్వం పిఈటిలకు న్యాయం జరుగుతుందని వేయికళ్ళతో ఎదురుచేస్తున్నారు. పిఈటిలకు, ఎస్ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్) వారికి కామన్ సీనియరిటీని ఇవ్వాల్సిందిగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిఈటిలు అభ్యర్థిస్తున్నారు. అలా కుదరని పక్షంలో కనీసం మండలానికి ఒకటి లేదా రెండు పోస్టులను పిఈటిలకు కేటాయించాల్సిందిగా కోరుకుంటున్నారు. లేకపోతే పిఈటిలు ఎప్పటి దూర ప్రాంతాల్లోనే పనిచేయాల్సిన ఉంటుందని పిఈటిలు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలింగ్‌లో అసలు శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో పిఈటి పోస్టులు ఉన్నత పాఠశాలల్లో ఎక్కక్కడెక్కడ ఉన్నాయో కౌన్సిలింగ్‌లో చూపించాలని పిఈటిలు డిమాండ్ చేశారు. లేకపోతే దీనిపై ధర్నాలు , రాస్తారోకోలు చేయాల్సి వస్తుందని తెలిపారు.

## శాస్త్రీయ పద్ధతుల్లో పందుల పెంపకంతో అధిక లాభాలు.

-డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య

తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాత వార్త



శాస్త్రీయ పద్ధతుల్లో పందుల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని వెటర్నరీ వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మ య్యసూచించారు తిరుపతిలోని వెటర్నరీ కళాశాలలో చదువుకుంటున్నప్పుడే పందుల పెంపకంలో అధిక లాభాలు పొందడం అనే అంశంపై 22 మంది విద్యార్థినీ విద్యార్థులకు పందుల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు బీవిఎస్సి చదువుతున్నప్పుడే పందుల పోషణ యాజమాన్యం ఆరోగ్యం, మాంసం మార్కెటింగ్ మీద ఎల్పిటి విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పొంది వాటి పెంపకాన్ని శాస్త్రీయ గా అధ్యయనం చేసినందుకు అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ భారత దేశంలో ఎక్కడ లేని విధంగా తిరుపతి వెటర్నరీ కళాశాల లోనే మొట్టమొదటిసారి ప్రారంభించినట్లు తెలిపారు ఎల్ పి టి విభాగధిపతి విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరు నెలల పాటు పందుల సంరక్షణ, యాజమాన్యం పందుల వధ, పంది మాంసం మార్కెటింగ్ పై సంపూర్ణ అవగాహన కల్పించామని వారు ఇప్పుడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కొత్త ఉపాధి అంశాలు పెంపొందించుకొని అధిక లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు చెక్కులు, సర్టిఫికెట్లు ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :



కలెక్టరేట్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్‌కు నిత్యం వచ్చు ప్రజలు వివిధ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి భోజన వసతికి ఇబ్బందులు లేకుండా ఉండేలా క్యాంటిన్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఉదయం అల్పాహారం, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డీఆర్వో నరసింహులు, కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎస్ఐ మృతికి సంతాపం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నివాసముంటున్న రిటైర్డ్ ఎస్ఐ పర్వ తాల శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సోమవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులు సంతాపం తెలిపారు. ఆయన మృత దేహానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఓదార్చారు. శ్రీకాళహస్తిలో నివాసముంటూ వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి మంచిపేరు సంపాదించుకున్న శ్రీనివాసులు కొంత కాలంగా అనారోగ్యంతో భాద పడ్డారు. ఆయన మరణానికి సంతాపం తెలిపిన వారిలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, స్వర్ణమూర్తి, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు సాధన మునస్వామి, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్ మొగరాల గణేష్ తదితరులున్నారు



## ప్రతిభకు పురస్కారం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



ఇటీవల విడుదలైన జూనియర్ ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ఒరెండవ స్థానం సాధించిన చదువురేడును సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించుటకు చిన్నచిన్న సన్మానాలు ఏర్పాటు చేస్తున్నామని దామోదర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తిలోని ఓ పేద కుటుంబంలో జన్మించి తల్లి దండ్రుల కష్టార్జితంతో ఎంతో శ్రద్ధగా చదవిన ఏ భావన అనే విద్యార్థి జూనియర్ ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం సాధించారు. ఆ విద్యార్థిని సత్కరిస్తూ తల్లిదండ్రులకు పాఠశాలకు చదువు చెప్పిన గురువులకు మంచిపేరు సాధించిన భావన భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వివరించారు. మన ప్రయత్నంతో పాటు దైవబలం ఎంతో ముఖ్యమని ఆయన వివరించారు. ప్రతి విద్యార్థి బావనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన సురేంద్రరెడ్డి, ఆంటొని పాల్గొన్నారు.

## యానాది పిల్లల చదువులకు ఎన్ని పాట్లో



శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గిరిజన కాలనీల్లో విద్యార్థుల చదువుకు పాఠశాలల విలీనం శాపం చుట్టుకుంది. ముఖ్యంగా ఏర్పేడు మండలంలోని పలు గిరిజన కాలనీల్లోని పాఠశాలలను మోడల్ స్కూల్స్‌లో విలీనం చేయటంతో విద్యార్థులు మైళ్ళ దూరం నడవాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ నేపధ్యంలో ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామ పంచాయతీలోని పోతుమానుగుంట గిరిజన కాలనీకి చెందిన పాఠశాలను ఎర్రమిట్టలోని పాఠశాలలో విలీనం చేసినట్లు గిరిజనులు వాపోతున్నారు. కాలనీలో పాఠశాల ఉంటేనే గిరిజనుల పిల్లలు పాఠశాలకు వెళ్ళటం కష్టం. అలాంటిది జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటి వెళ్ళటం సాధ్యమా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అ ంతేకాక సుమారు 5 నుంచి 6 కిలో మీటర్లు పయనించాలి. ఇంటిపక్కన పాఠశాలకే వెళ్ళలేని వాళ్ళు ఆటోలు ఏర్పాటు చేసుకొని అంతదూరం వెళతారా? అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుడు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి గిరిజనుల పిల్లల దుస్థితిని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు.

***తల్లిదండ్రుల ఆవేదన:*** పోతుమానుగుంట యానాది కాలనికి చెందిన విద్యార్థుల తల్లులు మాట్లాడుతూ కూలి చేసుకొని పూట గడుపుకునే తాము తమ పిల్లలను బడిలో చేర్చుకొని అక్షరాలు నేర్చుకుంటున్నారు. అయితే సోమవారం పాఠశాల ఉపాధ్యాయుడు ఈ బడి మూసివేస్తున్నారు. ఇందుకు సంతకాలు పెట్టమని కోరుతున్నారని వివరించారు. తమ బిడ్డలను బడికి ప ంపాలంటే తమకు స్థోమత లేదు. అంతేకాక బస్సు రోడ్డు రైల్వే లైన్ దాటాల్సి వస్తుంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు బడి మూసివేస్తే తమ బిడ్డలకు తమతో పాటు అడవికి లేదా కూలి పనికి తీసుకెళ్ళాలి తప్ప అక్షరాలు నేర్పించలేమంటూ స్పష్టం చేసారు. మోడల్‌స్కూల్స్ నేపధ్యంలో పలు గిరిజన దళిత వాడల్లోని విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం చోటు చేసుకుంటుంది. జిల్లా కలెక్టర్ స్పందించి ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

## ఉపాధి కల్పతరువు సిఎం చంద్రబాబు



తొట్టంబేడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానాన్ని తుచ తప్పకుండా అమలు చేసి చెప్పిన విధంగానే మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా రాష్ట్ర నిరుద్యోగ యువీయువకులకు చంద్రబాబు నాయుడు ఉద్యోగాల కల్పతరువుగా నిలుస్తున్నారని తెలుగుదేశం పార్టీ బిసి నాయకులు పేర్కొన్నారు. సోమవారం బిసి నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం 16,347 పోస్టులతో డిఎస్సీ నోటిఫికేష్ విడుదల చేసి ఎంపికైన అభ్యర్ధులకు రెండు నెలల్లో పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వానికి ఉపాధ్యాయ ఉద్యోగార్ధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారని పేర్కొన్నారు. 2014-2019 మధ్యకాలంలో ఉపాధ్యాయ పస్తులు భర్తీ చేసిన చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న తన హయాంలో డిఎస్సీ ప్రక్రియను చేపట్టి 11 నోటిఫికేషన్ల ద్వారా 1,80,208 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన గొపప మానవతావాది అని కొనియాడారు. ఉపాధ్యాయుల్ని మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించడం, అప్రెంటీస్ విధానం అంటూ పిచ్చి చేష్టలతో నిరుద్యోగులను వంచించిన మోసగాడు మాజీ సిఎం అని దుయ్యబట్టారు. ఈకార్యక్రమంలో మిన్నల్‌రవి, ఉమేష్‌రావు, మునిరాజయాదవ్, కోటచంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సేవాకార్యక్రమాల్లో పాదచారులకు దాహార్తి తీర్చుదాం



ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(రవాణ), ఏప్రిల్ 21 ప్రభాతవార్త

పోలీసులు సేవాకార్యక్రమాల్లోనూ ముందుండాలని, మండుతున్న ఎండలకు ఎక్కడెక్కడనుండి తిరుపతికి వస్తున్న పాదచారులకు యాత్రికుల దాహార్తితీర్చడం పోలీసులు చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోరారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆధ్వర్యంలో ప్రకాశంరోడ్డులో ఏర్పాటుచేసిన తాగునీటి సదుపాయాన్ని ఎస్పీ సోమవారం ప్రారంభించారు. ఇక్కడ ప్రజలకు, పాదచారులకు ఎస్పీనే మంచినీరు అందించి వారి దాహార్తితీర్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ బొడ్డు హేమంత్, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి, పోలీసు అధికారులు, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు

## ఫిర్యాదిదారులకు న్యాయం చేస్తాం

తిరుపతి(రవాణ), ఏప్రిల్21ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో పుత్తూరు సిఐ సురేంద్రనాయుడు పాల్గొ న్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు బాదితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఆయన బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు

## గోవులకు కూల్‌కూల్ కూలర్లు

తిరుపతి(రవాణ), ఏప్రిల్21ప్రభాతవార్త



ఎస్వీగోశాలలో గోవులకు కూల్‌కోసం ఎయిర్ కూలర్లను తిరుపతి జిల్లా జనసేననేత కిరణ్‌రాయల్ విరాళంగా అందించారు. జనసేనాని పవన్‌కల్యాణ్ సూచనలతో నాలుగు ఎయిర్ కూలర్లు ఇవ్వడం జరిగిందని కిరణ్ తెలిపారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

గిరిజన కాలనీలో సందర్శించిన ఉపాధ్యాయులు



బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:

బడిఈడు పిల్లలు బడిలో చేర్పించాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ గిరి జన కాలనీలను సందర్శించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లివెట్టు పరిధిలో గల గాంధీ గిరిజన కాలనీ, మొక్కల చేను గిరిజన కాలనీలను సందర్శించి బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను సమీప కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో ఆ గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు గురించి వివరించారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, లక్ష్మయ్య, ముని మస్తాన్‌రెడ్డి, జగన్నాథంలు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తి దారుల సంఘాలతో అభివృద్ధి

ఏరియా కో-ఆర్డినేటర్ వనజాక్షి



బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:

రైతు ఉత్పత్తి దారుల సంఘాలతో అభివృద్ధి సాధించ వచ్చని ఏరియా కో-ఆర్డినేటర్ వనజాక్షి తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం రైతు ఉత్పత్తి దారుల సంఘాలు లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కో-ఆర్డినేటర్ వనజాక్షి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారులు సంఘాలు పొదుపులు సక్రమంగా చేసుకుంటూ చిన్న చిన్న అవసరాలకు విత్తనాలు, ఎరువులు కొరకు అప్పులు తక్కువ వడ్డీతో పొందడమేకాకుండా వారికి కావలసిన విత్తనాలు, ఎరువులు అందరూ కలసి కొనుగోలు చేయడం, పంటను నిల్వ ఉంచి గిట్టుబాటు ధరకు అమ్మడం, పెద్ద గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసుకుని పరికరాలు లీజుకు ఇవ్వడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలియజేశారు. సమావేశంలో రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య జిల్లా ఏపీఎం దాక్షాయణి, జిల్లా జీవనోపాధులు ఏపీఎం ధనంజయరెడ్డి, ఏపీఎం మునెయ్య, రైతు సంఘాలు లీడర్లు, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప పాల్గొన్నారు.

## బ్లూమింగ్ బడ్స్‌లో ఘనంగా "గ్రాడ్యుయేషన్ డే"

చంద్రగిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ కిండర్ గార్టెన్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు విద్యారంభ దశను జరుపుకునే గొప్ప అవకాశాన్ని కల్పించారు. గ్రేడ్ 1 నుండి 10 వరకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాలలో ప్రతిభ ఆధారంగా ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించి, అవార్డులు ప్రధానం చేశారు. అంతకు ముందు కరస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులలో మౌళిక నైపుణ్యాలను, విజ్ఞానాభివృద్ధి, విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యం అన్నారు.

## ఎస్ వి వర్సిటీ డిగ్రీ పరీక్షలు రెండు రోజులు వాయిదా

తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాత వార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22,23 వ తేదీలలో ఆరంభం కావలసిన బి.ఏ,బి.కాం, బియస్సీ డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు అనగా మొదటి రెండు రోజులలో జరగాల్సిన సబ్జెక్టులను వాయిదా వేస్తున్నట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి వుంది. కొన్ని సాంకేతిక కారణాల రీత్యా వాయిదా పడ్డాయని, ఈ రెండు పరీక్షలను మే నెల 12,14 తేదీల్లో నిర్వహిస్తానని వారు తెలియజేశారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జరగవలసిన వివిధ సబ్జెక్టులు యథాతథంగా ఆయా తేదీల్లోనే జరుగుతాయని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## గోపాలన్న పెట్టిన విద్యాభిక్షను లాక్కోవద్దు

మైనార్టీ నాయకులు.

రేణిగుంట ఏప్రిల్ 21 ప్రభాతవార్త

మాజీ మంత్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ముస్లిం విద్యార్థులకు ఉర్దూ బోధించడం కోసం దాదాపు 26 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించి నిర్మించిన ఉర్దూ పాఠశాలను లేకుండా విద్యార్థులను ఇతర పాఠశాలలకు బదిలీ చేయవద్దు అంటూ మైనార్టీ నేతలు వేడుకుంటున్నారు. ఈ మేరకు వారంతా ఎంపీడీవో విష్ణు చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. రేణిగుంట పట్టణంలో సుమారు 35 ముస్లింలు ఉన్నారని, వారి మాతృభాష ఉర్దూ చదువుకోవాలన్న ఉద్దేశంతో పాఠశాలను అప్పటి మంత్రి కీర్తిశేషులు గోపాలన్న అప్రేడ్ చేయించడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ మధ్యకాలంలో పాఠశాల లేకుండా చేయాలన్న ఉద్దేశంతో విద్యార్థులను ఇంగ్లీష్ మీడియం మోడల్ స్కూల్ కు బదిలీ చేయించడానికి తప్పు పట్టారు. తద్వారా పాఠశాల విద్యార్థుల శాతం తగ్గుతుందని దీంతో పాఠశాలను పూర్తిగా మూసివేసే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే ఉర్దూ పాఠశాల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని ఆశ్రయిస్తామన్నారు. వెంటనే ఉర్దూ పాఠశాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను మైనార్టీ నాయకులు, టిడిపి సీనియర్ నేత మునీర్ జీకే, రంతుల్లా, జాకీర్ హుస్సేన్, జిలాని, మహబూబ్ బాషా ముబారక్, మహభాష, సలీం, సమీవుల్లా, అష్రాఫ్ అలీ, అబ్దుల్ బదిరుద్దీన్, కాసిం పీర్ తదితరులు ఉన్నారు. ఆర్జిటీ 1. ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు.

## ఏఐ వినియోగంపై అవగాహన సదస్సు



కృత్రిమ మేధస్సు (ఎఐ)ను బాద్యతా యుతంగా వినియోగించ డంలో ప్రజా సంబంధాలు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య పివి నరసయ్య తెలిపారు. కృత్రిమ మేధ ఏఐని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజా సంబందాల నిపుణులు, సాంకేతిక నిపుణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం జరిగింది.

ప్రభాతవార్త-తిరుపతి

# గూడూరు డివిజన్

## మారుమూల గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర



తడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మారుమూల పల్లెల్లో ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు పోలీసులు రాత్రిపూట పల్లెనిద్ర చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తడ మండలం లోని పల్లెల్లో కూడా ఈ పల్లెనిద్రలు జరుగుతున్నాయి. ఎస్ఐ కొండప్పనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పులికాట్ సరస్సు ఒడ్డున ఉన్న వాటంబేడు కుప్పంలో పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా జాలర్ల కుప్పం వాసులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఏ వేళ అయినా ఇబ్బందులు వస్తే ఇక్కడికి చేరుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ కుప్పంలో ఈ నెల 25 నుంచి శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న కారణంగా ముందుగానే పోలీసులు వెళ్లి కొన్ని సూచనలు, మరికొన్ని హెచ్చరికలు చేసి రావడం మేలయిందని పలువురు అంటున్నారు.

## 461వ నేత్రదాత వేనాటి అమరేంద్రరెడ్డి



తడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ప్రాంతంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా 461వ నేత్రదాతగా వేనాటి అమరేంద్రరెడ్డి నిలిచారు. తడ మండలం వెండ్లూరుపాడు గ్రామ పంచాయతీకి చెందిన గుర్రాలమిట్ట నివాసి వేనాటి అమరేంద్రరెడ్డి (53) మరణానంతరం వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయ వారికి పంపించినట్లు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు ప్రకటించారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం అమరేంద్రరెడ్డి 461వ నేత్రదాతగా నిలిచారని, ఆయన మరణించినప్పటికీ నేత్రదానం వలన మరో ఇద్దరి శరీరాలతో జీవించి ఉంటారని కొనియాడారు.

## ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలి



కోట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రైతులు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలని వెలుగు ఎపిఎం అనిల కోరారు. సోమవారం కోట మండలం తిన్నెలపూడిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇళ్ల ముందు పెరటి తోటలను పెంచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పెట్టుబడి కావా లంటే సంఘాల నుంచి రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులు డేటా ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ పెంచలయ్య, అగ్రికల్చర్ విఎఎ దినేష్, ఎఫ్‌టిఓ శంకర్, మోడల్ మేకర్ శ్రీనివాసులు, మండల ఇన్‌ఛార్జ్ పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తిన్నెలపూడిలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు



కోట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. బిపి, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సులలో మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, విజయ కుమార్‌రెడ్డి, చైతన్య, భాను, పంచాయతీ కార్యదర్శి రియాజుద్దిన్, టిడిపి నాయకురాలు సుష్మారెడ్డి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్ర నిర్వహకులపై చర్యలు తీసుకోవాలి



గూడూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్ర నిర్వహ కులపై చర్యలు తీసుకోవాలని గూడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణం లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆర్.ఎం. వో.కి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ గూడూరు రూరల్ మండల పరిధిలోని అయ్యవారి పాలెంకి చెందిన నారాయణమ్మ గత 8 సంవత్సరాలుగా గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లోని డయాలసిస్ కేంద్రం వద్ద డయాలసిస్ చేయించుకుంటున్నారు. మంగళ వారం ఉదయం 7గంటలకు డయాలసిస్ ప్రారంభం కాగా ఉదయం 9 గంటలకి బి.పి తగ్గింది అని కారణంతో రోగి చనిపోయిందని, వెంటనే మృత దేహాన్ని తీసుకుని వెళ్ళాలని తొందర చేసి పంపించేశారు అన్నారు. ఈ విషయమై డయాలసిస్ కేంద్ర నిర్వాహకులను అడుగగా మీ దిక్కున చోటు చెప్పు కొండి అని వాపోయారు. ఇకనైనా ఈ విషయమై సమగ్రంగా విచారించి డయాలసిస్ కేంద్ర నిర్వాహకులు పై చర్యలు చేపట్టి, బాధితురాలి మృతిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## కందుకూరి రంగస్థల ప్రతిష్టాత్మక విశిష్ట పురస్కారం



గూడూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : పట్టణంలోని స్థానిక ఎస్‌కెఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అర్ధ శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే కందుకూరి రంగస్థల ప్రతిష్టాత్మక విశిష్ట పురస్కారం 2025తో సత్కరించినందుకు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ జీవితాన్ని ప్రతిబింబించేదే నాటకం నాటకానికి ప్రతిస్పందించేది జీవితం అని అని, పీర్ కుమార్ కళాశాలలో అధ్యాపకుడుగానే కాకుండా చాలా కాలంగా వివిధ నాటక పరిషత్తులలో పాల్గొంటూ నటుడిగా ప్రతిభ చూపుతూ రచయితగా కూడా రాణించడం, ఇటీవల మెగా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి నంది అవార్డుతో గౌరవించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణరాజు, కోటేశ్వరరావు, విజయ మహేష్, మైమూన్, ఝాన్సీ వాణి, గోవిందు, సురేంద్ర, శైలజ, కిరణ్మయి, కృపా కరుణ వాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన క్యూఆర్ కోడ్ ద్వారా తెలపండి



వాకాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రాష్ట్ర మహిళ భద్రతపై, డ్రగ్స్ నిర్మూలనపై రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కరపత్రాలను పోలీసులు అంటించారు. పోలీసులు ఉన్నత ఆదేశాల మేరకు సోమవారం వాకాడు పోలీస్‌లు చేతుల మీదుగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో గోడకు క్యూఆర్ కర పత్రాలను అంటించారు. ఈ కరపత్రాలు అంటించిన పోలీసులు అనిల్ కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

## తిమ్మాజికండ్రిగ చెరువులో గుర్తుతెలియని మృతదేహం!



నాయుడుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామసమీపంలో ఉన్న చెరువులో సుమారు (30) సంవత్సరాలు వయస్సు కలిగిన యువకుడు మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచ్చారం అందించారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ బాబి తన సిబందితో కలిసి సంఘటన స్థలంకు చేరుకొని ప్రమాధం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుడు నీలిరంగు చొక్క, కాకికలర్ ప్యాంటు, సిల్వర్ కలర్ వాచ్‌లు చెరువు కట్టపై పడివున్నట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని చెరువులో నుండి బయటకు తీసి పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యువకుడు చెరువులో స్నానం చేయుటకు వచ్చి గుంటలోపడి మృతిచెందాడా, ఎక్కడైన హత్యచేసి ఇక్కడకు తీసుకొచ్చి చెరువులో పడేశారన్న కోణంలో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం



వెంకటగిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : మున్సిపాలిటి సుదర్శన్ నగర్ సచివాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల రోజు జరగడం జరిగినది. ఇందులో బాగంగా 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ప్రజాల దగ్గరనుండి అర్జీలు స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు దార శివ,కొండూరు రత్నం రాజు పాలొన్నారు. 14వ వార్డు బొగ్గులమిట్ట ధర్మాపురం, నరసింహారావు వీధి అరుంధతి వాడ నందు గత నెల రోజులనుండి పారిశుద్ధ్య కార్మికులు హాజరు కావడంలేదు. బొగ్గులమిట్ట నందు 8 వీధి దీపాలు వెలగడం లేదు, ధర్మాపురం నందు 6 వీధి దీపాలు వెలగడం లేదు నరసింహారావు వీధి అరుంధతి వాడ నందు 6 వీధి దీపాలు వెలగడం లేదు, హనుమాన్ నగర్ నందు 6 వీధి దీపాలు వెలగడం లేదు, మా 14 వ వార్డు నందు ఎక్కువగా కులీ పనులు చేసుకొని జీవించే వారు ఉన్నారని ప్రజలు తెలిపారు.

## గ్రామాల్లో ఇండిగ్యాప్ పొలం బడి కార్యక్రమం



వెంకటగిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : సబ్ డివిజన్‌కి సంబంధించి నారి ఎఫ్పిఒ కో-ఆప్ సొసైటీ లిమిటెడ్ అధ్వర్యంలో ఇండిగ్యాప్ పొలం బడి కార్యక్రమం నిర్వహించినట్లు ఏడిఏ ఎం. నాగార్జునసాగర్ తెలిపారు. రైతులు రసాయన ఎరువులు వాడకండి తగ్గించాలని సూచించారు. ఈ సబ్ డివిజన్‌కి సంబంధించి నారి ఎఫ్పిఒ కో-ఆప్ సొసైటీ లిమిటెడ్ సభ్యులైన 15 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌సిపిసిఏ జిల్లా ఏవాల్యూయేటర్ కె. మునిశేఖర్, వెంకటగిరి, బాలాయపల్లి, దక్కిలి మండల వ్యవసాయ అధికారులు సుజాత, శిరీష, విజయభారతి రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. రైతులకు మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై వివరాలు అందించారు. రైతుల నుంచి విత్తన నమూనాలు సేకరించి వాటిని పురుగు మందుల అవశేషాల కోసం బెంగళూరు ల్యాబ్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి డివిజన్ లో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## బోరు మోటారు వేయకనే ... రూ.లక్ష డ్రా చేసేశారు

### -జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీపీ



పెద్దపంజాణి ఏప్రిల్ 21 ప్రభాతవార్త: గ్రామంలో ప్రభుత్వం తరపున ఇదివరకూ వేయించిన బోరుమోటారు ఉండగానే ఆబోరు మరమ్మత్తులకు గురైందని బోరుకు మోటారుతోపాటు పైపులు అధనంగా బిగించడం జరిగిందని పేర్కొంటూ ఓ వ్యక్తి ఏకంగా అధికారుల సహకారంతో ఏంచక్కా ఎమ్‌బుక్కు రికార్డుచేసి గ్రామంలో బోరుమోటారు కొత్తగా ఏర్పాటుచేసినట్లు దాదాపు లక్షరూపాయలకు పైగా నిధులను కొట్టేసిన సంఘటన సోమవారం వెలుగుచూసింది.ఈ అంశంపై మాజీ ఎంపీపీ మురళీకృష్ణ జిల్లాకలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు.దీనిపై స్పందించిన జిల్లాకలెక్టర్ పూరిస్థాయిలో విచారణజరిపి తగుచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు మాజీ ఎంపీపీ మురళీకృష్ణ తెలిపినమేరకు వివరాలిలా.. బసవరాజుకండ్రిగ గ్రామంలో దాదాపు 300కుటుంబాలు నివాసం ఉంటున్నాయి వీరిసౌకర్యార్థం గతంలో ప్రభుత్వం రక్షిత మంచినీటిబోరును ఏర్పాటుచేసి దాని ద్వారా ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తోంది. అయితే ఈఏడాది మార్చి నెలలో గ్రామంలో ఉన్న బోరుమోటారు మరమ్మత్తులకు గురైనట్లు దాన్ని 1.71లక్షల రూపాయలకు వ్యయంచేసి మరమ్మతులు చేయించినట్లు ఓ వ్యక్తి అధికారుల సహకారంతో ఏకంగా ఎమ్‌బుక్కు రెడీచేసి నగదును డ్రా చేసేశాడు.ఈ సంఘటన తెలుసుకున్న గ్రామస్థులు విస్తుపోయారు. గ్రామంలో బాగాఉన్న బోరు మరమ్మతులకు గురైనట్లు పేర్కొంటూ ఓ వ్యక్తి నగదు కాజేయడంపట్ల గ్రామస్థులు ముక్కున వేలేసేకుంటున్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పలమనేరులో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సైతం హాజరయ్యారు.ఈ సందర్భంగా పెద్దపంజాణి మాజీ ఎంపీపీ మురళీకృష్ణ బసవరాజుకండ్రిగ గ్రామంలో జరిగిన అవకతవకల గురించి జిల్లాకలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన జిల్లాకలెక్టర్ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఆక్రమిత రైతులకు పరిహారం పంపిణీ

కోట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : మండలం కొత్తపట్నం సమీపంలో శ్రీసిటీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆక్రమిత భూముల్లో పంట సాగు చేస్తున్న రైతులు రోడ్డు పనులను అడ్డగించారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ జయజయరావు అక్కడికి వెళ్లి రైతులతో చర్చలు జరిపారు. ఎకరాకు రూ.15 వేలు వంతున పంట పరిహారం పంపిణీ చేశారు.

## మహిళలకు చీరల పంపిణీ



వాకాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామదార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మునుసూరు మస్తాన్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో 35 మంది మహిళలకు 45 వేల రూపాయల విలువ చేసే చీరలను ఆలయ ధర్మకర్త, వాకాడు సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మమత, బిరదవోలు సరిత, కోడివాక రంగయ్య స్వామి, సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, వంశీ ప్రియ, సుశాంతి, శిరీష, రమాదేవి, నాగమోనిక, అరిసి నరేష్ శర్మ, పవన్, లోకేష్, శేషాద్రి, తేజ, మణికంత, వాసు, శేషాచార్యులు, చలపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎపి సీడ్స్ అధికారి తీరుకు నిరసన: విధులు బహిష్కరించిన హమాలీలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఏపీ సీడ్స్ అధికారి తీరుకు నిరసనగా ఇక్కడ పని చేసే హమాలీలు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. సోమవారం ఎపి సీడ్స్ కార్పొరేషన్ ఆవరణలో హమాలీలు తమ బాధలను వివరిస్తూ ఇక్కడ అధికారి తీరుతో తాము జీవనోపాది కొల్పోతున్నామని తమ ఆవేదనను వ్యక్తం చేసారు. ఎపి సీడ్స్‌లో విత్తన ఉత్పత్తి కార్యక్రమం ప్రారంభించి కూలీలకు పని కల్పించాల్సి ఉండగా అధికారులు స్పందించటం లేదని కూలీలు వాపోతున్నారు. ఎపిసీడ్స్ అధికారి తీరును నిరసిస్తూ విధులు బహిష్కరించి నిరసనలు వ్యక్తం చేసారు. గత 40 సంవత్సరాలుగా బ్రతుకు తెరువు కోసం ఏపీ సీడ్స్‌లో హమాలీలుగా పని చేస్తుంటే నేడు పని కల్పించటం లేదని తమ బతుకుతెరువు ఎలా అంటూ హమాలీలు అవేదన వ్యక్తం చేసారు.ఎపి సీడ్స్‌లో వరి ధాన్యంను శుద్ధి చేసి నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసే విధంగా గత 40 సంవత్సరాలుగా హమాలీలకు పని కల్పిస్తున్నారు. సుమారు 50నుంచి 100 మంది వరకు సీడ్స్ కార్పొరేషన్ కల్పించే పని మీద ఆధారపడి బతుకు జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఏపిసీడ్స్ విత్తన ఉత్పత్తి పనులకు కేవలం ఐదు మంది మాత్రమే రావాలని ఇంత మంది కూలీలు అవసరం లేదని చెప్పారని దీంతో కూలీలు విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. అందరికి పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పలువురు కూలీలు మాట్లాడుతూ ఎపీ సీడ్స్‌లో మార్చి నుంచే విత్తనోత్పత్తి కార్యక్రమం చేపట్టి ఉపాది కల్పించే వారన్నారు.కానీ ఇప్పటి వరకు చేపట్టలేదన్నారు. ఎపిసీడ్స్‌లో ఉన్న ధానాన్ని శుద్దిచేసే ప్రక్రియ చేపట్టడానికి ప్రతి రోజూ వస్తున్నామని సీడ్స్ మేనేజర్ అనుమతించటం లేదని ఆరోపించారు. కేవలం ఐదుమందిని మాత్రమే చాలని చెబుతున్నారన్నారు.ఎపీ సీడ్స్‌ను నమ్ముకొని కుటుంబాలు సాగుతున్నాయన్నారు. తమ దుస్థితిని స్థానిక శాసనసభ్యుని దృష్టికి తీసుకువస్తామన్నారు. హమాలీల యూనియన్ నాయకుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎపీ సీడ్స్‌లో అధికారులు తీరుతో రైతులు నామమాత్రంగా ధాన్యం సరఫరా చేశారని అది కూడా ప్రాసెసింగ్ చేయకుండా కూలీల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికైనా అధికారులు స్పందించిహమాలీలకు న్యాయం చేయాలన్నారు.

## లారీని వెనుకవైపు నుండి ఢీ కొట్టిన మరో లారీ



గూడూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ఓ లారీని వెనుక వైపు నుండి మరో లారీ ఢీకొట్టిన సంఘటన గూడూరు రూరల్ పరిధిలోని బైపాస్ సర్కిల్ ప్రాంతంలో తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు నుండి చెన్నైకు మిర్చి లోడుతో వెళ్తున్న లారీని వెనకవైపు నుండి మరో లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్‌కు, క్లీనర్‌కు తీవ్ర గాయాలు పాలైయ్యారు. చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్సై మనోజ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు

### - కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ కాలనీలో వెల్డింగ్ షాపు వలన వచ్చే శబ్దాలతో ఇబ్బందిగా ఉందని, అక్కారం పల్లిలో మూసివేసిన కాలువలు వినియోగంలోకి తేవాలని, కుక్కల బెడద తగ్గేలా చూడాలని, చంద్రశేఖర్ రెడ్డి కాలనిలో యూడీఎస్ కాలువ బ్లాక్ అవుతున్నది శాశ్వత పరిష్కారం చూపాలని, శ్రీకృష్ణ నగర్‌లో తుడా ఉద్యోగి రోడ్డు ఆక్రమించి గోడ కట్టారు చర్యలు తీసుకోవాలని, నీటి కనెక్షన్ లేకున్నా బిల్లు వస్తోంది పరిష్కరించాలని, రైతు బజారు వద్ద రోడ్డుపై అమ్మకాలు చేస్తుండడంతో రైతు బజారులో వ్యాపారాలు జరగడం లేదు పరిష్కరించాలని, తిలక్ రోడ్డు మురుగు కాలువలు పూర్తిగా పాడయ్యాయి బాగు చేయాలని, కోరమేనుగుంట లో గిఫ్ట్ డీడ్ ఇచ్చినా టిడిఆర్ బాండ్ ఇవ్వలేదని, సిపిఆర్ అపార్ట్మెంట్ వద్ద కాలువపై బండలు తొలగించడంతో చెత్త వేస్తున్నారు పరిశీలించాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డి.ఈ.లు, ఏసిపిలు ఉన్నారు.

## నియోజకవర్గంలో బిటి రోడ్లకు రూ. 21.60 కోట్లు

### ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో తారు రోడ్ల నిర్మాణానికి రూ. 21.60 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ సోమవారం తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలో నగరి రూరల్, నింద్ర, విజయపురం మండలాల్లో 21తారు రోడ్లు నిర్మిస్తామన్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీరుకు ఆయన అందించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా రోడ్లను నిర్మించాలని డిఇకి సూచించారు. అలాగే రోడ్ల పనులను త్వరితంగా పూర్తి చేసి ఆయా గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు తీర్చాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో నగరి నియోజకవర్గంలో ఇప్పటికే సిమెంట్ రోడ్లనిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, ఈ నిధులతో త్వరలోనే బిటిరోడ్లు కూడా నిర్మిస్తామని తెలిపారు. నగరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు.

## తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



పుంగనూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : పట్టణంలో ప్రతి సోమవారం జరిగే సంతలో ఓ ఆరేళ్ల బాలిక తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేటలో నివాసముంటున్న శోభారాణి సోమవారం సంతకు తన ఆరేళ్ల కుమార్తెతో వచ్చింది. అయితే నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే సమయంలో బాలిక తప్పిపోయింది. బాలిక కనిపించకుండా పోవడంతో తల్లి శోభారాణి ఆర్తనాదాలు చేస్తూ ఎంత వెదికినా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు కిషోర్, శోభారాణిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్ ఐ లోకేష్ తన సిబ్బందితో పట్టణంలో గాలిస్తుండగా బాలిక ఆచూకీ లభ్యమైంది. బాలికను వెంటనే పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులను పట్టణ ప్రజలు అభినందించారు.

## వ్యవసాయ కళాశాల విద్యార్థులచే జాతీయ సదస్సు




తిరుపతి విద్య, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి నందు పోస్ట్ గ్రాడ్యుయేట్ వ్యవసాయ విద్యార్థుల నేషనల్ కాన్ఫరెన్స్ రెండు రోజులు పాటు నిర్వహించ నున్నట్లు వ్యవసాయ వర్సిటీ పీజీ డీన్ డాక్టర్ ఎం వి రమణ తెలిపారు సోమవారం వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ థీమ్ అగ్రి టెక్ నెక్సస్ బ్రిడ్జింగ్ సైన్స్ సస్టైనబులిటీ,ఫుడ్ సెక్యూరిటీ అంశంపై పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు తమ పరిశోధనలను ప్రదర్శించడానికి సహచర్లతో చర్చలకు పాల్గొనడానికి,నిపుణుల నుండి విలువైన సూచనలను పొందడానికి గొప్ప అవకాశం అందిస్తుందని, ఈ కార్యక్రమానికి ఉప కులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, ముఖ్యఅతిథిగా ఐసి ఏ.ఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజ్బీర్ సింగ్,డాక్టర్ ఇంద్రమణి ఉపకులపతి,వసంతరావు నాయక్ మరాట్వాడా కృషి విద్యపీట్ మహారాష్ట్ర,డాక్టర్ వి.పలనిముత్తు,డైరెక్టర్,ఎన్ఐఎఫ్‌టిఇ యం.తంజావూర్, హరికిషన్ సుదిని ప్రిన్సిపల్ సైంటిస్ట్,డాక్టర్ మనీష్ కె పాండే, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఇక్రిసాట్ పాల్గొంటున్నారని తెలియజేశారు.ఈ సదస్సుకు 762 పీజీ విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు.ముఖ్యంగా తెలంగాణ,తమిళనాడు, మహారాష్ట్ర, చత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, హర్యానా, న్యూఢిల్లీ, పశ్చిమ బెంగాల్,ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మణిపూర్ వంటి రాష్ట్రాల నుండి పీజీ విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు.అంతేకాకుండా అంతర్జాతీయ పీజీ విద్యార్థుల నుండి కూడా పరిశోధన పత్రాలు అందాయని ముఖ్యంగా యూనివర్సిటీ ఆఫ్ ఇ లినాయిస్,యూనివర్సిటీ ఆఫ్ చికాగో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా,వరల్డ్ వెజిటెబుల్ సెంటర్ తైవాన్ వంటి ప్రఖ్యాత సంస్థల నుంచి పరిశోధన పత్రాలు వచ్చాయని తెలిపారు.ఈ సమావేశంలో అసోసియేట్ డీన్ఎన్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో త్రిపుర గవర్నర్ పూజలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 21 ప్రభాతవార్త : దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం త్రిపుర గవర్నర్ కుటుంబసభ్యులతో కలసి పలు పూజలు,అభిషేకాలు జరిపించుకున్నారు. సోమవారం త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి కుటుంబసభ్యులతో వచ్చారు.తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును డెప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, సిఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడు, పిఆర్ఓ రవి పర్యవేక్షించారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.72 కోట్లు ఆదాయం

కాణిపాకం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.72 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 24రోజులకు గాను హుండీల ద్వారా 1,71,77,943 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 165 గ్రాముల బంగారు,ఒక కిలో 350 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 13,814 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 42,436 రూపాయలు ఆదాయంగా లభించింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి,ధనుంజయ,ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యం నాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.